క్లుప్తంగా

ఉపాధి పనులు కల్పించండి



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళితులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకి గ్రామానికి చెందిన దళితులకు ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వారు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. గత నెల రోజుల నుంచి ఉపాధి పనులు కావాలని అడిగినా ఇంత వరకు పనులు కల్పించలేదని, పనులు లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తూ ఎంపీడీఓ భానుమూర్తికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. దీనిపై అధికారులు స్పందించి గురువారం నుంచి పనులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో వేతనదారులు సంతృప్తి చెందారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు, మండల నాయకుడు రాము, పెదపెంకి దళితులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న పీఆర్ ఏఈ చంద్రమౌళి

సీతానగరం: మండలంలోని ప్రజల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరుచేసిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండలకేంద్రంలో చేపట్టవలసిన పనుల ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాల్లో రూ.2.87 కోట్ల వ్యయంతో 35 పంచాయతీల్లో 95 పనులు మంజూరు చేసినట్లు తెలియజేశారు. మంజూరు చేసిన పనుల్లో కొన్ని ప్రారంభించినప్పటికీ వేగవంతంగా పూర్తి చేయా లని, ప్రారంభించాల్సిన పనులు నిర్దేశించిన గడువులోగా నిర్వాహకులు ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకుడు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బగ్గందొరవలసలో తాగునీటి ఎద్దడి

సీతానగరం: మండలంలోని బగ్గందొరవలసలో మంచినీటి పథకం సక్రమంగా పని చేయకపోవడంతో గ్రామస్తులు మంచినీటి కొరతతో కష్టాలు పడుతున్నారు. పథకం అమలుకు ప్రభుత్వం లక్షలు వెచ్చించినా నిర్వాహకులు పట్టించుకోలేదని తద్వారా మంచినీటి సమస్య ఎక్కువగా ఉందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికే నెల రోజులు గా తాగునీరు రావడం లేదని చెబుతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్ కుమార్ వద్ద ప్రస్తావించగా ఆర్అండ్‌బీ రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా పైప్‌లు శిథిలమవడంతో తాగునీరు సరఫరా కాక ఇబ్బందులు వస్తున్నాయని అన్నారు. గ్రామానికి రెండు రోజుల్లో మంచి నీటి సమస్య పరిష్కరించనున్నట్లు తెలిపారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోండి



గోపాలపురంలో తపాలా శాఖ పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీపీఎం రవికుమార్

గుమ్మలక్ష్మీపురం: తపాలా జీవిత బీమా, పొదుపు పథకాలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని పి.ఆమిటి బీపీఎం, తపాలా శాఖ ఉద్యోగుల సంఘం డివిజనల్ కార్యాదర్శి రవికుమార్ అన్నారు. తపాలా శాఖ ద్వారా ప్రతి ఒక్కరికీ పొదుపు పథకాలు/జీవిత బీమా అందించాలనే సంకల్పంతో నిర్వహిస్తున్న 'వన్ జన్ ధన్' (గిరిజన ప్రాంత ఆర్థిక చేరిక) కార్యక్రమంలో భాగంగా మంగళవారం పి.ఆమిటి పోస్టాఫీస్ పరిధిలోని గోపాలపురం, పి.ఆమిటి, కారివలస, మొరమగూడ గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పలు సేవింగ్ స్కీములు, బీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 2023 ఆగస్టు 9 వరకు చిన్న మొత్తాల పొదుపు పథకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఇందులో చేరి స్కీమ్ ప్రయోజనాలు పొందాలని కోరారు.

బాబా భక్తుల భిక్షాటన

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయి బాబా ఆలయంలో జరుగుతున్న 21వ వార్షికోత్సవం, 17వ అఖండ సాయినామ సప్తాహం కార్యక్రమంలో భాగంగా బాబా భక్తులు గ్రామంలోని పలు వీధుల్లో మంగళవారం భిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 8న స్వామివారి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, విశేషపూజలు, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు

• ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్:

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండలంలోని తాళ్లబురిడి గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జోగారావు ప్రతి ఒక్క గడపకు వెళ్లి గ్రామాల్లో గల 1037 కుటుంబాలను కలిసి వారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్న తీరును స్వయాన అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికైనా, ఏ ఒక్క ప్రభుత్వ పథకం రాకపోయినా, ఆ విషయాన్ని తెలుసుకున్నారు. అర్హుల పేర్లను అధికారులతో నమోదు చేయించారు. కార్యక్రమం చివరి రోజు మంగళవారం గ్రామంలో గల సచివాలయంలో మండల, స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో వలంటీర్లు, సచివాలయం ఉద్యోగులతో సమావేశమై నాలుగు రోజులపాటు గ్రామంలో గడపగడపలో గుర్తించిన ప్రతి సమస్యను అడిగి తెలుసుకుని, సమస్యల వారీగా విభజించి ఆయా శాఖల వారీగా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సకాలంలో పరిష్కారం అయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రభుత్వ సేవల్లో అశ్రద్ధ వద్దు

కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరంతా ప్రభుత్వ సేవలను అందించడంలో ఏమాత్రం అలసత్వం వహించినా, అశ్రద్ధ చూపించిన ఎన్నో కుటుంబాలు వీధిన పడతాయని కాబట్టి అందరూ చాలా జాగ్రత్తగా విధులను సక్రమంగా నిర్వహించి, అర్హతకలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ప్రభుత్వ సహాయసహకారాలు అందేలా కృషి చేయాలని, విధుల పట్ల అలసత్వం వహించిన వారిని ఉపేక్షించేది లేదని తెలియజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు బలగ రేవతమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీటీసీ మర్రాపు మంగమ్మ, సర్పంచ్ చప్ప రామకృష్ణ, కోఆప్షన్ ఎంపీటీసీ షేక్ కరీం, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు బి.కృష్ణమూర్తి, మర్రాపు వాసుదేవరావు, మడక విశ్వనాథం, వి.గురురాజు, పీఏసీఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు పండు, జి.సతీష్, జె.ప్రవీణ్‌కుమార్, నాయకులు పి.శ్రీనివాసరావు, ధనుంజయ్, కార్యకర్తలు, హౌసింగ్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

మండలంలోని తాళ్లబురిడి గ్రామానికి చెందిన కెల్ల నారాయణరావు కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న సందర్భంగా అత్యవసర చికిత్స కోసం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలుసుకున్న ఎమ్మెల్యే జోగారావు ముఖ్యమంత్రి సహాయ నిధికి సిఫార్సు చేశారు. ఈ మేరకు వచ్చిన సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే జోగారావు మంగళవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. తమ కుటుంబాన్ని ఆదుకున్న ప్రభుత్వానికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బలగ రేవతమ్మ నాయకులు నాగేశ్వరరావు, మర్రాపు వాసుదేవరావు, గురురాజు, తీళ్ల శివున్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వంతెన నిర్మాణం పూర్తిచేయాలి

మండలంలోని తాళ్లబురిడి-ములగ గ్రామాల మధ్య నిర్మాణం జరుగుతున్న సాకిగెడ్డ వంతెన పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. రూ.సుమారు కోటితో జరుగుతున్న సాకిగెడ్డ వంతెన పనులను మంగళవారం పరిశీలించారు. తాళ్లబురిడి గ్రామంతో పాటు ములగ తదితర 11 గ్రామాల ప్రజల రాకపోకలకు ఈ వంతెన ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, వంతెన పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు.

అసలైన రైతుకు భూమి చెందాలి

• తహసీల్దార్ ఎన్వీ రమణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలో భూములు రీసర్వే చేస్తున్న అధికార సిబ్బందికి రైతులంతా సహకరించి తమ భూములను భద్రపరుచుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు మంగళవారం లక్ష్మీపురం గ్రామంలో రీ సర్వే డీటీ చిట్టెమ్మ ఆధ్వర్యంలో జరుగుతున్న రీ సర్వే పనులను తహసీల్దార్ ఎన్వీరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం భూముల రీసర్వే జరిగిందని తాజాగా జగనన్న ప్రభుత్వం అసలైన రైతులకు భూములు చెందాలనే సంకల్పంతో రీ సర్వే ప్రక్రియ 2020లో ప్రారంభించినప్పటికీ కోవిడ్ కారణంగా పనులు నిలిచిపోయాయన్నారు. భూములకు సంబంధించి క్రయ విక్రయాల్లో వివిధ రకాల మార్పులు జరిగాయన్నారు. రైతులు సాగుచేస్తున్న భూములకు సంబంధించిన హక్కు అదేరైతు పేరున లేదని తెలియడంతో భూ తగాదాలు పేరుకుపోతున్నట్లు గుర్తించి భూముల స్థిరీకరణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత జగనన్న భూ హక్కు భూరక్ష పథకం ద్వారా రీ సర్వే పనులు ప్రారంభించినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకరరావు, సర్వే సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

నిర్దేశించిన స్థలాల్లో ఉపాధి పనులు చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు..టెక్నికల్ సహాయకులు, మేట్‌ల ఆధ్వర్యంలో చెరువులు, గోర్జల్లో నిర్దేశించిన స్థలాల్లో పనులు చేసి గిట్టుబాటు వేతనం పొందాలని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం సూరంపేట గ్రామంలో పాట్టివానిబంద, ఊరట్యాంక్‌లలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా పనుల్లో పాల్గొనే వేతన దారులందరూ ఎండలు తీవ్రంగా ఉన్నందున సమయపాలన పాటిస్తూ టెక్నికల్ సహాయకులు ఇచ్చిన మార్కింగ్ ఆధారంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. చెరువుల్లో మెటీరియల్ కాంపొనెంట్ అభివృద్ధి పనులు చేపట్టడానికి వేతనదారులు సిద్ధం కావాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల కృషి వెలకట్టలేనిది

• కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో పారిశుద్ధ్య కార్మికుల కృషి వెలకట్టలేనిదని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ నిషాంత్ కుమార్ ప్రశంసించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని చాంబర్‌లో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు హైజెనిక్ కిట్‌ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికులు నిర్వహించిన విధులు వెలకట్టలేనిదని కొనియాడారు. ఇటీవల జరిగిన ఇప్పల పోలమ్మ, ఎర్రకంచమ్మ గ్రామ దేవతల ఉత్సావాలలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు కనబరచిన నిబద్ధతను ప్రత్యేకంగా కలెక్టర్ అభినందించారు. బాధ్యతగా చెత్త సేకరిస్తున్న కార్మికుల పట్ల ప్రజల్లో గౌరవం పెరిగిందన్నారు. గ్రామాల్లో ప్రజా సహకారంతో స్వచ్ఛ జిల్లాగా అవతరించే దిశగా తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు హైజెనిక్ కిట్‌లను కలెక్టర్ పంపిణీ చేశారు. కొత్తవలస కాలనీలో ఈదురు గాలులకు పాక్షికంగా ఇల్లు దెబ్బతిన్న నిరుపేదకు బియ్యం, నిత్యావసర సరుకులు, దుప్పటి, చిన్నారులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పల నాయుడు, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు, కోశాధికారి పెంటపాటి సూర్యారావు, ఎంసీఎం సభ్యులు బెలగాం జయబాబు, బోటు రామకృష్ణ, పి.ప్రకాష్, జిల్లా కో ఆర్డినేటర్ యమ్మల జనార్దన రావు, స్వచ్ఛంద కార్యకర్తలు మునిసాయి, పూర్ణ చంద్రరావు, బి.వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



హైజెనిక్ కిట్లు అందజేస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

12న విత్తన మహోత్సవం

గుమ్మలక్ష్మీపురం:ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరు లాంలో ఈనెల 12న నిర్వహించే విత్తన మహోత్సవానికి రైతులంతా హాజరుకావాలని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ టీఎస్ఎస్‌కే పాత్రో మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ విత్తన మహోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి వివిధ విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు, వ్యవ సాయ రంగ నిపుణులు హాజరవుతారని వెల్ల డించారు. వీరంతా ఆధునిక సాగు పద్ధతు లు, సలహాలు, సూచనలు అందిస్తారని పేర్కొన్నారు. అలాగే వరి, కంది, మినుము లు, పెసర, శనగ, వేరుశనగ, నువ్వులు, రాగులు, కొర్ర, జొన్న మొదలగు విత్తనాలతో పాటు నూతన రకాల విత్తనాలను విక్రయానికి అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పశువులకు వైఎస్సార్ బీమా



పాడి పశువులను తనిఖీ చేస్తున్న సబ్‌డివిజనల్ ఏ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్

సీతానగరం: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన వైఎస్సార్ పశుబీమా పథకాన్ని పశువులున్న రైతులు వినియోగించుకోవాలని సీతానగరం సబ్ డివిజన్ పశుసంవర్ధక శాఖ ఏ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పశువైద్య కేంద్రంలో పశువులను తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల భాగస్వామ్యంతో వైఎస్ఆర్ పశుబీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో బహుళ ప్రయోజనాలున్నాయని తెలియ జేశారు. వైఎస్ఆర్ పశుబీమా పథకంలో పశువులపేర్లు నమోదు చేయించుకున్న వాటికి ఏప్రమాదం సంభవించినా బీమా వర్తిస్తుందన్నారు. రైతుల పెంపకంలో ఉన్న దేశ వాళీ పశువుల్లో ఒక రైతు 5 పశువులకు రూ.20 వేలు వంతున బీమా ప్రీమియం వర్తిస్తుందన్నారు. అదే సంకర జాతి, హెచ్‌ఎఫ్, జెర్సీ ఆవులకు రూ. 30 వేలు వంతున ప్రీమియం వర్తిసుందని చెప్పారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే పశువులకు ఒక్కోదానికి రూ.30 వేలు, దేశవాళీ పశువులకు ఒక్కోదానికి రూ.15 వేలు వర్తిస్తుందని వివరించారు. బీమా ప్రీమియం చెల్లించడానికి లబ్ధిదారు తెల్లరేషన్‌కార్డు కలిగి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రైతులు 3 సంవత్సరాలకు రూ.384 ప్రీమియం చెల్లించాలని, అలాగే ఇతరులు 3 సంవత్సరాలకు రూ.964 చెల్లించాల్సి ఉంటుందన్నారు. మేకలు, గొర్రెలు, పందులకు కూడా వైఎస్సార్ పశు బీమా పథకం ప్రవేశపెట్టినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

జమదాలలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరం



చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

పార్వతీపురంటౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో మండలంలోని ప్రతి గ్రామంలో నెలకు రెండు సార్లు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జమదాల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం నిర్వహించి గర్భిణులు, వృద్ధులు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రతి నెలలో రెండుసార్లు నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యపరీక్షలను చేస్తూ అందుబాటులో ఉన్న 62రకాల మందులను రోగి అవసరం మేరకు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నామని చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచిస్పందన లభిస్తోందని సంతృప్తి వెలిబుచ్చారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటాఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

పట్టా భూములను గిరిజనులకు అప్పగించాలి



నిరసన తెలుపుతున్న గిరిజన సంఘ నాయకులు

జియ్యమ్మవలస: మండలంలోని బొడ్డవలస గిరిజనుల పట్టాభూములు తిరిగి వారికి అప్పగించాలని కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన కార్యక్రమం చేపట్టారు. జియ్యమ్మవలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 9లో బొడ్డవలసకు చెందిన గిరిజనులు కె.చంద్రయ్య, కె.తమ్మయ్య, కె.పగడాలు, నిమ్మక పెంటయ్యకు నాలుగెకరాల డీపట్టా భూమి ఉందని, ఆ భూమిని సర్వేచేసి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. గత 40 సంవత్సరాలుగా ఆ భూమి వారి సాగు ఆధీనంలోనే ఉందని, ఇటీవల కొందరు గిరిజనేతరులు దీనిపై పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడంతో వివాదాస్పదంగా మారిందన్నారు. సమగ్ర సర్వే చేసి నిజమైన పట్టాదారులకు ఆ భూమిని అప్పగించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సీతారామయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కె.సీతారం, కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం



శివకుమార్ భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైద్యాధికారి బుద్దేశ్వరరావు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కేదారిపురం సెక్షన్‌లో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పత్తిక శివకుమార్ ఇటీవల మృతి చెందడంతో పీహెచ్‌సీ పరిధిలో పని చేస్తున్న వైద్య సిబ్బంది ఆ కుటుంబానికి అండగా నిలిచారు. రూ.90 వేలు విరాళాలు సేకరించి వైద్యాధికారి ఎం.బుద్దేశ్వరరావు చేతులమీదుగా మంగళవారం శివకుమార్ భార్య దీపకు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. శివకుమార్ కుటుంబానికి తోటి ఉద్యోగులంతా అండగా నిలవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సింహాచలం, సూపర్‌వైజర్లు శ్రీను, ఎర్రయమ్మ, సింహాచలం, హెల్త్ అసిస్టెంట్లు నిమ్మకూరి రత్నప్రసాద్, ఎస్.వి.ప్రకాష్, బి.లక్ష్మణ, ఏఎన్ఎంలు ఎం.ప్రభావతి, అర్చన్, ధనలక్ష్మి తదితరులున్నారు.

దేశ భవిష్యత్ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

• జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్



ర్యాలీ ప్రారంభిస్తున్న డీఈఓ ప్రేమకుమార్



విద్యార్థుల ప్రదర్శన

పార్వతీపురంటౌన్: నిరంతరం మారుతున్న సామాజిక అవసరాలకు అనుగుణంగా నిత్య నూతన లక్ష్యాలను నిర్మించుకుంటూ, నూతన ప్రణాళికలను ఏర్పరుచుకుంటూ, ఆ దిశగా నిరంతరం కృషి చేయాలని, దేశ భవిష్యత్ నిర్మాణానికి అవసరమైన పౌరులుగా నేటి విద్యార్థులను తీర్చిదిద్దాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ కుమార్ హితవు పలికారు. ఈ మేరకు మంగళవారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి జన్ భాగిదారి ప్రదర్శన (ఎగ్జిబిషన్)లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 15 మండలాల నుంచి మండలానికి ముగ్గురు చొప్పున 45 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంబంధిత ఉపాధ్యాయులు ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వరకు జన్ భాగిదారి ర్యాలీని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున జన్ భాగిదారి కార్యక్రమం ఎంతో ఉత్కృష్టమైనదన్నారు. జాతీయ విద్యా విధానం 2020 నినాదం ఒకే దేశం-ఒకే విద్య ఆవశ్యకతను వివరిస్తూ దేశంలోనే ఎన్ఈఎఫ్-2020ను అమలుచేస్తున్న తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని, 5+3+3+4 విద్యా విధానం ఎంతో ఉపయోగకరమైనదన్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

రెండు విడతలుగా ఇంతవరకు జరిగిన నాడు-నేడు కార్యక్రమాలతో జిల్లాలోని చాలావరకు పాఠశాలల రూపు రేఖలు పూర్తిగా మారాయని, పాఠశాలల్లో కావలసిన తరగతి గదులు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, డిజిటల్ బోధన అభ్యసన పరికరాలు, తాగునీరు, ప్రహరీలు తదితర అనేక సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. కల్పించిన సౌకర్యాలు తగురీతిలో ఉపయోగించుకుంటూ ఇకమీదట నాణ్యమైన విద్య అందించడం ఉపాధ్యాయుల ప్రధానమైన బాధ్యతగా గుర్తెరగాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో అక్షరాస్యత, సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలను పెంపొందించి, వారి సర్వతోముఖాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సామాజిక భాగస్వామ్యం ఆవశ్యకతను విశదీకరంచారు. ఈ ఏడాది లాగానే రానున్న సంవత్సరాల్లో కూడా ఫలితాల్లో మన జిల్లా ప్రథమస్థానంలో ఉండేలా అందరూ కృషి చేయాలని, మన్యం జిల్లా రాష్ట్రానికి మణిహారంగా నిలవాలని ఆకాంక్షించారు. సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రాజేశ్వరి, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అసౌకర్యం లేకుండా భూసర్వే



గొట్టివలసలో రీసర్వేను పరిశీలిస్తున్న ఉపతహసీల్దార్ శివున్నాయుడు

గరుగుబిల్లి: రైతులకు అసౌకర్యం లేకుండా భూముల రీసర్వేను నిర్వహిస్తున్నామని రీసర్వే ఉప తహసీల్దార్ ఎన్.శివున్నాయుడు అన్నారు. మండలంలోని గొట్టివలస, గొల్లవానివలస, సీమలవానివలస, సాంబన్నవలస గ్రామాల్లో నిర్వహిస్తున్న రీసర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసమస్యలు తలెత్తకుండ ఉండేందుకు ఆధునిక పరికరాలతో సర్వే చేసి హద్దురాళ్లను వేయడం జరుగుతుందన్నారు. నిర్ధేశించిన సమయానికి సర్వే పూర్తిచేయనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు సాంబన్నవలస, శివ్వాం, మరుపెంట, సీతారాంపురం, బీవీపురం, గంగరాజుపురం గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందన్నారు. సమస్యలు ఉన్న భూములను పెండింగ్‌లో పెట్టినట్లు చెప్పారు. ఆయన వెంట సర్వేయర్ బి.సాయికుమార్, వీఆర్‌ఓ కరుణాకర్, రామకృష్ణ తదితరులు ఉన్నారు.